క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని తూగుండ్రం సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మండల పార్టీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు తూగుండ్రం నుంచి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ప్రతిరోజూ 'స్పందన' నిర్వహించాలి


సూచనలు ఇస్తున్న ఆర్డీఓ సుజన

నగరి: ప్రతిరోజు సచివాలయ సిబ్బంది స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆర్డీఓ సుజన అన్నారు. బుధవారం బుగ్గ అగ్రహారం సచివాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సరైన సమయానికి సచివాలయానికి హాజరు కావాలని, డోర్ టు డోర్ వెరిఫికేషన్ పూర్తిచేయాలని సూచించారు. ప్రతిరోజు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రీసర్వే ప్రక్రియను ముందుగా రైతులకు తెలియపరిచి వారి సమక్షంలో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్డీఓ వెంట డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఆర్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్యామ్‌ను ఢీకొన్న వ్యాన్


పొలాల్లోకి దూసుకెళ్లిన వ్యాన్

శ్రీరంగరాజపురం: మండలంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి జంగాలపల్లి వద్ద డ్యామ్ గోడలను పార్సెల్ సర్వీస్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరుకు చెందిన డ్రైవర్ మాసలమణి వ్యాన్‌ను పుత్తూరు నుంచి చిత్తూరు వైపు వేగంగా నడుపుతూ జంగాలపల్లె వద్ద డ్యామ్‌ను ఢీకొన్నాడు. నిద్రమత్తు, అతివేగం కారణంగానే ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వ్యాన్ పొలాల్లోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను చిత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోలాహలంగా గంగమ్మ నిమజ్జనం


అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలకేంద్రం పాలసముద్రంలో గంగజాతరను పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు. ఉదయం నడివీధిలో ఉంచిన గంగమ్మ తల్లికి ప్రతి ఇంటి నుంచి మహిళలు పిండిదీపాలతో కుంభం వేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేపట్టారు. సాయంత్రం యువత రంగులు చల్లుకుని గంగమ్మతల్లిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి


భవిత కేంద్రంలోని మౌలిక వసతుల గురించి వివరిస్తున్న ఐఆర్‌టీ టీచర్లు

పాలసముద్రం: దివ్యాంగులైన బడిఈడు పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించి వారు చదువుకునేందుకు సహకరించాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం భవిత కేంద్ర ఐఆర్‌టీ ఉపాధ్యాయులు బాలాజీ, వసంత కలసి పాలసముద్రం పంచాయతీలో దివ్యాంగ పిల్లలను సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ విద్యాశాఖ దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిందన్నారు. అందులో 21 రకాలైన దివ్యాంగ పిల్లలను గుర్తించి వారికి భవిత కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తామని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. దివ్యాంగ విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు వికలాంగులమనే మానసిక బాధను పారదోలేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం ముగ్గురు పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించారు.

ప్రతిభకు పట్టాభిషేకం

- 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన
- రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా విద్యార్థులకు పురస్కారాలు
- రాష్ట్రాభివృద్ధికి విద్యే పునాది
- మంత్రి ఆర్‌కే రోజా



నగరి మండలంలో టాపర్లుగా నిలిచిన పదో తరగతి విద్యార్థులతో మంత్రి రోజా

నగరి: విద్యతోనే రాష్ట్రాభివృద్ధికి పునాది అని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం తన చారిటబుల్ ట్రస్టు ద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన 85 మందిని, ఇంటర్‌మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన 24 మందిని ఆమె దుశ్శాలువలతో సన్మానించి షీల్డులు, బహుమతులు అందజేశారు. ఇంటర్ విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్లు అందించారు. విద్యార్థుల ప్రోత్సాహానికి ఇప్పటి వరకు నగరి చరిత్రలో లేని కొత్త అధ్యాయానికి ఆమె నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యే రాష్ట్రాభివృద్ధి పునాది అని జగనన్న నమ్మారు గనుకే నేడు ఏ రాష్ట్రంలో లేనివిధంగా, మునుపెన్నడూ జరగని విధంగా విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యను సాధారణ ప్రజలకు అందించిన ఘనత జగనన్నదే అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం నాడునేడు, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, గోరుముద్ద, రాగిజావా, బైజూస్ కంటెంట్, ఇంగ్లిష్ మీడియం అంటూ ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. విద్యారంగానికి అరవై వేల కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తుండడం గొప్ప విషయమన్నారు. ఈ సహకారాన్ని అందిపుచ్చుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి మేనమామ జగన్‌మోహన్ రెడ్డికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారన్నారు. అందుకే వారిని తమ ట్రస్టు ద్వారా అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య అన్నారు. ఆ విద్యలో కేజీ నుంచి పీజీ వరకు అండగా ఉండడానికి జగనన్న ఉన్నారన్నారన్నారు.


విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయండి..

ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని విద్యార్థులు ఆ వైపుగా దూసుకెళ్లాలని మంత్రి రోజా అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో నంబర్‌వన్‌గా ఉండాలన్నారు. పిల్లల చదువుకు సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రికి ఆ చదువును విద్యార్థులకు అత్యుత్తమంగా బోధిస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తున్నానని తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు రాని వారు దిగులు పడాల్సిన అవసరం లేదన్నారు. తాను కూడా సినిమా రంగం, రాజకీయ రంగాల్లోకి వచ్చినప్పుడు తొలుత అపజయాలే చవిచూశానని, అయినా ఎప్పుడూ వెనకడుగు వేయలేదన్నారు. మనల్ని మనమే ప్రోత్సహించుకుని ముందుకు సాగితే అన్నీ సాధ్యమవుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, చిత్తూరు, తిరుపతి డీఈఓలు విజయేంద్రరావు, శేఖర్ రెడ్డి, మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, నగరి, పుత్తూరు ఎంపీపీలు భార్గవి, మునివేలు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓ శ్రీదేవి, జెడ్పీటీసీలు, వైస్ చైర్మన్లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోజమ్మ మేలు మరువలేం


పుత్తూరులో పౌష్టికాహారం తింటున్న గర్భిణులు

పుత్తూరు రూరల్/నగరి: కడుపు నిండా పౌష్టికాహారం అందిస్తున్న మంత్రి రోజమ్మ మేలు ఎప్పటికీ మరువలేమని పలువురు గర్భిణులు అన్నారు. స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులు మాట్లాడుతూ ఆస్పత్రిలో చెక్ అప్‌ల కోసం వచ్చే మేము పరీక్షల కోసం వేచి ఉండాల్సి వస్తుందన్నారు. అయితే తాము భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారని, ఆమె రుణం తీర్చుకోలేనిదని అన్నారు. అయితే మంత్రి రోజా గత రెండున్నరేళ్లుగా నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్లు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శంకర్ నరేష్, ఆస్పత్రి డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, పుష్పమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌తో ఉపాధి అవకాశాలు


శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందిస్తున్న ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి

కార్వేటినగరం: స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటుందని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ కాలం(3నెలలు)లో స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన వారు వివిధ రంగాల్లో ఉపాధి పొందవచ్చన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తోందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని త్వరగా ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. అదేవిధంగా గతంలో స్కిల్ హబ్‌పై శిక్షణ పొందిన వారికి ప్రిన్సిపల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఏకాంబరం, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ అబ్దుల్, డిప్యూటీ ట్రైనింగ్ అధికారి విక్రమ్, అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారి విజయకుమార్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

చల్లగా చూడు గంగమ్మ



గట్టు గ్రామంలో గంగమ్మను దర్శించుకుంటున్న కుమారస్వామిరెడ్డి, ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం జరిగిన గంగమ్మ జాతర వేడుకల్లో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామి రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేటి జగనన్న ప్రభుత్వంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, ఇలాగే పదికాలాల పాటు చల్లగా చూడు గంగమ్మ తల్లీ అంటూ వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల గంగజాతర కమిటీ ఆధ్వర్యంలో కుమారస్వామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోవిందస్వామిరెడ్డి, మురళీయాదవ్, మండల కోఆప్షన్ మెంబర్ రాంబత్తయ్య, కౌన్సిలర్ ఏకాంబరం, నాయకులు నానీ, మురళి, వెంకటముని మేస్త్రి పాల్గొన్నారు.

వేడుకగా గంగ జాతర


భక్తులను కటాక్షిస్తున్న గంగమ్మ

వడమాలపేట: మండల కేంద్రమైన వడమాలపేట గంగమ్మ జాతర వేడుకగా బుధవారం భక్తుల కోలాహలం నడుమ కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని పురవీధులలో ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద కర్పూర హారతులు ఇస్తూ మొక్కులు తీర్చుకున్నారు. వైభవంగా జరిగిన ఈ జాతర మహోత్సవానికి పరిసర గ్రామాల ప్రజలు తండోపతండాలుగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి గ్రామోత్సవం అనంతరం విశేష అలంకరణలో ఉన్న గంగమ్మతల్లిని నడివీధిలో నిలిపారు. మొక్కులు తీర్చుకునే భక్తులు వెయ్యి కండ్ల దుత్తలతో దీపాలు వెలిగించి అమ్మవారికి సమర్పించారు. జాతర సందర్భంగా బజారువీధి భక్తుల షాపింగ్ దుకాణాలతో కళకళలాడింది. భక్తులు అమ్మవారికి మేళతాళాలతో కుంభం పోసి మొక్కుకున్నారు. రాత్రి అమ్మవారి నిమజ్జనంతో జాతర ముగిసింది.

డ్రోన్ సర్వే ప్రారంభం


డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: మున్సిపల్ పరిధిలో మా భూమి–మా హక్కు పథకంలో చేపట్టనున్న డ్రోన్ సర్వేను బుధవారం మంత్రి ఆర్‌కే రోజా తన క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు. కచ్చితమైన ఆస్తుల వివరాలను ప్రతి ఒక్కరికీ పత్రాల రూపంలో అందించడానికి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో త్వరితగతిన పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. సర్వే చేసి పట్టాను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, డీఈ నరేష్, టౌన్‌ప్లానింగ్ అధికారి నీరజాక్షి పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ


యుద్ధంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు, అంకనపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ద్రౌపదీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ చూపరులను అలరించింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధన వధ ఘట్టం ఆకట్టుకుంది. భీముడు దుర్యోధనున్ని గంగమడుగు నుంచి తీసుకొచ్చే ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అదేవిధంగా దుర్యోధనుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. అనంతరం ధర్మరాజుకు వేద పండితులు పట్టాభిషేకం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం..

మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు పూలమాలలు ధరించి, చేతిలో వేపాకులతో గోవింద నామస్మరణాలతో భక్తి శ్రద్ధలతో అగ్నిగుండంలో ప్రవేశించారు. కార్యక్రమంలో ధర్మకర్త లింగారెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, నిర్వాహకులు రామనాథరెడ్డి, మణి, జనార్దన్, బాబు, లోకనాథరెడ్డి, డిసెంబర్‌శెట్టి, దాముఆచారి, దామునాయుడు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా 'సంక్షేమ' కాంతులు


సంక్షేమ పథకాలను వివరిస్తున్నా డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాంధర నెల్లూరు(కార్వేటినగరం): కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం మండలంలోని పాచిగుంట సచివాలయం పరిధిలోని పాచిగుంట, పాచిగుంట దళితవాడ, గొల్లపల్లి, బాలాపురం, బిచ్చిరెడ్డిపల్లి, చౌటూరు గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా తప్పుడు ఆరోపణలు చేస్తూ వైఎస్సార్‌సీపీ సర్కారుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఒకప్పుడు ఏ పథకం కావాలన్నా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాల ద్వారా ప్రజా సమస్యలు అక్కడే పరిష్కారం అవుతుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి జగనన్నను సీఎం చేయాలని ఆయన ప్రజలను కోరారు.

వారి విజ్ఞతకే వదిలేస్తున్నా..

ఈ సందర్భంగా గ్రామంలో డిప్యూటీ సీఎం పర్యటన ఉందని తెలిసి కొంతమంది టీడీపీ సానుభూతిపరులు తమ ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లారు. దీనిపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబునాయుడి మనస్తత్వం కలిగిన కొందరు తాను గ్రామంలో పర్యటిస్తున్నానని తెలిసి తమ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోవడం దుర్మార్గమన్నారు. వారికి మా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అని తెలిపారు. అనంతరం బాలపురం గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామం మొత్తం గతంలో టీడీపీకి కంచుకోటగా ఉండేదన్నారు. కానీ ఈ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలాలు ఇచ్చారని, పిల్లలకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన అందించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పైచదువులకు సాయం చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో కూడా మా గ్రామస్తులు అంతా జీవితాంతం సీఎం జగనన్నకు తోడుగా ఉంటామన్నారు. అలాగే పాచిగుంట నుంచి బాలపురం వరకు రోడ్డు, బస్సు సౌకర్యం లేదని విన్నవించగా, వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ వీలైనంత త్వరగా రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, ఎంపీపీ అనిత, మండల కన్వీనర్ పూర్ణచంద్ర రెడ్డి, రాజేంద్రనాయుడు, నవీన్ నాయుడు, సుధాకర్, ప్రభాకర్, చంద్రారెడ్డి, మునిరాజులురెడ్డి, లోకేష్ రెడ్డి, కరెంట్ డీఈ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ ఇన్బనాథన్, ఎంపీడీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. బుధవారం పండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్, హౌసింగ్ సిబ్బందికి మండల విస్తరణాధికారి రమేష్‌తో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఎంపీడీఓ శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో జరుగుతున్న గృహనిర్మాణాలు, జగనన్న కాలనీల్లో జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు, ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దాము, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మకు సారె


పాదిరికుప్పంలో నడివీధి గంగమ్మకు సారె సమర్పిస్తున్న కృపాలక్ష్మి


పాదిరికుప్పంలో జలధికి వెళుతున్న నడివీధి గంగమ్మ

కార్వేటినగరం: మండలంలోని పాదిరికుప్పంలో వెలసిన నడివీధి గంగమ్మకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె, రాష్ట్ర మహిళా నాయకురాలు కే.కృపాలక్ష్మి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వచ్చి బుధవారం ఆలయానికి అమ్మవారు చేరుకున్నారు. అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. రాత్రి అమ్మవారిని జలధికి తరలించడంతో గంగమ్మ జాతర ముగిసింది. అదేవిధంగా కార్వేటినగరం పెద్ద దళితవాడలో నడవీధి గంగమ్మ జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మొక్కులు ఉన్న భక్తులు ఇంటింటా పొంగళ్లు వండి, పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, చిత్తూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు, సర్పంచ్ ధనంజయవర్మ, పురంధర్, శ్రీనివాసులు, దాము, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటరత్నం పలువురు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు సహకరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారెడ్డి

వెదురుకుప్పం: భూముల రీసర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ పుల్లారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లెలో భూ రీసర్వేపై గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ముగ్గురు అధికారుల చొప్పున నాలుగు టీమ్‌లు సర్వే చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా వారికి సహకరించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను సర్వే డీటీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. భూ రీసర్వే ద్వారా వివాదాస్పదంగా ఉన్న సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. అనంతరం మాజీ వైస్ ఎంపీపీ బట్టే సుబ్రమణ్యం మాట్లాడుతూ వందేళ్ల తరువాత భూ సర్వే చేపట్టడం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. గతంలో ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భూరీసర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. సర్వే సిబ్బంది భూములకు సంబంధించి హద్దులు చూపి రాళ్లు నాటి రైతులకు హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ధనశేఖర్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


వృద్ధుల కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

కార్వేటినగరం: రాష్ట్రీయ సేవాసమితి(రాస్) ఆధ్వర్యంలో బుధవారం కార్వేటినగరం వృద్ధాశ్రమంలో శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని కోఆర్డినేటర్ వెంకటముని అన్నారు. బుధవారం రాస్ వృద్ధాశ్రమంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటముని మాట్లాడుతూ రాస్ సంస్థ సహకారం శంకర్‌నేత్రాలయ వారి సౌజన్యంతో అందిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వడమాలపేట, కార్వేటినగరం, పుత్తూరు, నారాయణవనం ప్రాంతాల్లో ప్రతి నెల ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్‌తో పాటు కంటిఅద్దాలు ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈవైద్యశిబిరంలో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరానికి 120 మంది రోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, తేజ, ప్రకాష్, ధనలక్ష్మి, శాంతి పలువురు పాల్గొన్నారు.